క్లుప్తంగా

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన ఊయల నందిని, పల్లయ్య భార్యాభర్తలు. వీరిది ప్రేమ వివాహం కాగా ఒక కుమార్తె. అయితే కొంత కాలంగా పల్లయ్య భార్యను కట్నం డబ్బుల కోసం వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి పంపేశాడు. భార్య పుట్టింటికి వెళ్లిన మూడు నెలలకు విడాకుల నోటీసులు పంపగా, కాపురానికి తీసుకువెళ్లాలని నందిని కోరింది. అయితే కాపురానికి తీసుకువెళ్లకుండా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇదే విషయాన్ని అత్త, మావయ్యలకు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా ఏపీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని ఏపీ టెక్నాలజికల్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. సూర్య తేజ అన్నారు. కోడ్ స్పార్క్ 2025 పేరుతో కేబీఎన్ కళాశాలలో జాతీయ స్థాయి హ్యాకథాన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యతేజ హ్యాక్‌తాన్‌ను ప్రారంభించి ప్రసంగించారు. విజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక అవసరం అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకోవటం కాదని, అవకాశాలని తయారు చేసుకున్న వ్యక్తి విజేతగా నిలుస్తాడన్నారు. రాష్ట్రంలోని కోటి 30 లక్షల కుటుంబాల నుంచి పారిశ్రామికవేత్తలు తయారు కావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

రేపు జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు):నగరంలోని రాఘవయ్య పార్కు సమీపంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నామని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ పెరుగుదల–నివారణ పద్ధతులు, ఆరోగ్యరంగ ప్రైవేటీకరణ–ప్రభావాలు– పరిష్కారాలు అనే అంశాలపై సదస్సు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఈ సదస్సులో ప్రముఖ డాక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొని రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, అందరికీ సమాన ఆరోగ్య సేవలు అందించడం, ఆరోగ్యశ్రీని బలోపేతం చేయడం, వైద్య ఆరోగ్యరంగ ప్రైవేటీకరణ ప్రభావాలు, క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, జీవన శైలిలో మార్పులపై ప్రసంగిస్తారని చెప్పారు.

స్టేడియంలో వసతులు పెంచండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ నిర్వహణలో ఉండే స్టేడియాల్లో వసతులను పెంచాలని, పాతవి పాడై పోయిన ప్రమాదకరమైన భవనాలను, గదులను సీజ్ చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బందర్ రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు స్టేడియంను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్టేడియంలో ఆడుకునేందుకు వచ్చేవారి కోసం మరిన్ని వసతుల్ని పెంచాలని, స్కేటింగ్ రింక్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టేడియంలో ప్రమాదకరమైన మూడు గదులను గుర్తించారు. అందులో ఒక గదిని వెంటనే సీజ్ చేసి అందులోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీర్లు స్ట్రక్చరల్స్ స్టెబిలిటీ చూసి, వాటిపై సరైన చర్యలు తీసుకోవాలని, స్టేడియం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్య నిర్వహణలో సక్రమంగా ఉండాలని చెప్పారు. ఈ పర్యటనలో ఎస్టేట్ ఆఫీసర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ ఎ.శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా జ్యోతి బాయి



లబ్బీపేట(విజయవాడతూర్పు):విజయవాడలోని డాక్టర్ నోరిరామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నిర్మల జ్యోతి బాయి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయుర్వేద కళాశాల స్థాపించి వందేళ్లు పూర్తికాగా, తొలిసారిగా ఒక మహిళ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషంగా చెబుతున్నారు. ఆమె అనుభవం, అంకితభావం కళాశాల అభివృద్ధికి తోడ్పడతాయని పలువురు కలిసి అభినందనలు తెలిపారు. కాగా ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలియచేసిన వారిలో ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ టి.బుల్లయ్య, డాక్టర్ వి. శ్రీధర్‌తో పాటు, నేషనల్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ వి.భానుప్రకాష్ తదితరులు ఉన్నారు. ఆయుర్వేద కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ కోలా విజయకుమారి, డాక్టర్ టి బుల్లయ్యలు పోస్టు గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. సహచర ప్రొఫెసర్లు అభినందనలు తెలియచేశారు.

కొండ ప్రాంతాల్లో భయం భయంగా!

- వర్షాలకు జారిపడుతున్న కొండచరియలు
- పలు నివాసాలు ధ్వంసం
- ముందస్తు సమాచారమిచ్చినా పట్టించుకోని వైనం



వీరయ్యవీధిలో జారిన రిటైనింగ్ వాల్



పెద్దిరాజువీధి కొండ ప్రాతంలో కింద నివాసాలపై జారిన రిటైనింగ్ వాల్



వీరయ్యవీధిలో జారిన కొండచరియలతో దెబ్బతిన్న రేకుల ఇళ్లు

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): వర్షాలు కురుస్తున్నాయంటే పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంత వాసులు భయం..భయంగా కాలం గడుపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనని బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు 49వ డివిజన్‌లోని వీరయ్యవీధి, పెద్దిరాజువీధి కొండప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ బీటలువారి జారి కింద కొన్ని నివాసాల మీద పడటంతో రేకులు పగిలిపోయి గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం సంభవించలేదు. దీంతో నివాసితులు ఊపిరిపీల్చుకున్నారు. పేదలు ఎక్కువగా నివసించే కొండ ప్రాంతంలో వర్షాలు కురిసే ప్రతిసారి ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతూనే ఉన్నాయి. అవసరమైన ప్రాంతాల్లో పటిష్టంగా రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు చేపట్టి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అందరూ పేదలే....

పేదలు అధికంగా నివాసముండే పశ్చిమ నియోజకవర్గంలో వేలకు వేలు ఇంటి అద్దెలు చెల్లించుకోలేక ఎక్కువగా కొండ ప్రాంతాలలో నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ప్రతిరోజు కూలీ పనులకు వెళ్లి రావాలన్నా వందల మెట్లు ఎక్కి, దిగి వ్యయప్రయాసాలు పడి రాకపోకలు సాగించుకుంటున్నారు. ఇంత కష్టపడి ఇంట్లో ప్రశాంతంగా జీవిస్తున్నామంటే ఎప్పుడు కొండ రాళ్లు, మట్టి చరియలు జారి తమ నివాసాల మీద పడుతుందోనని కంటి మీద కునుకు లేకుండా జీవిస్తున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

జారిపడుతున్న కొండ రాళ్లు...

పశ్చిమ నియోజవర్గంలో అధిక శాతం ప్రజలు కొండప్రాంతాల్లోనే నివాసం ఉంటున్నారు. వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ రాళ్లు, మట్టిచరియలు జారి పడటం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇప్పటికే అనేక ఇళ్లు ధ్వంసం అవ్వటంతో పాటు పలువురు ప్రాణాలు కూడా కోల్పోయిన సంఘటనలు గతంలో అనేకం చోటుచేసుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు 49, 50వ డివిజన్‌లోని కొండ ప్రాంతాలలో వేర్వేరు చోట్లు రిటైనింగ్ వాల్స్ జారి కొండ రాళ్లు, మట్టి చరియాలు కింద నివాసాల మీద పడిన ఘటనలో రెండు ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న సంఘటనలతో స్థానిక నివాసితులు హడలిపోయారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగపోకవడంతో కొంత మేరకు ఊపిరిపిల్చుకున్నారు.

ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలి...

వర్షాలు కురిసినప్పుడల్లా వరుస ప్రమాదాలు చేటుసుకుంటునే ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే రిటైనింగ్ వాల్స్ బీటలు వారి కూలుతున్నాయని స్థానికులు ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. ఇంకా కొండ ప్రాంతాలలో అనేక చోట్ల రిటైనింగ్ వాల్స్ దెబ్బతిని ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని, అధికారులు ఈ ప్రాంతాల్లో పర్యటించి ప్రమాదకర రిటైనింగ్ వాల్స్‌ను గుర్తించి వాటి పటిష్టతకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు



మాట్లాడుతున్న ఆర్.వెంకటరావు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నూతనంగా పరిశ్రమల స్థాపించాలనుకునే వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకటరావు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే యువతకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. వెంకటరావు మాట్లాడుతూ జనశిక్షణ సంస్థాన్‌లో వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారని తెలిపారు. స్వయం ఉపాధి కోర్సులు నేర్చుకున్న వారు నిధులు లేకపోవడం వల్ల సొంతంగా ఉత్పత్తి చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల పేరుతో సబ్సిడీతో రుణాలను మంజూరు చేయిస్తున్నాయని వెల్లడించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాలను పొందవచ్చునని వివరించారు. ఇందులో 35 శాతం వరకు రాయితీ ఇస్తోందన్నారు. ఈ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యా కన్నా మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్స్, ఎస్‌వీ సత్యనారాయణ, ఎం.లావణ్య, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయం

కమిషనర్ ధ్యానచంద్ర



డ్రెయిన్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయమని, విజయవాడ నగరంలోని మేజర్ ఔటఫాల్ డ్రెయిన్స్ అన్నిటికీ రెయిలింగ్స్ పెట్టాలని, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కొత్తపేట, పంజా సెంట్రర్, డ్రెయిన్‌వీధి, సుబ్బరామయ్య వీధి, గాంధీ హిల్, గవర్నర్‌పేట వెహికల్ డిపో ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే నగరంలో మేజర్ ఔట్ ఫాల్ డ్రెయిన్స్‌కి రెయిలింగ్స్ పెట్టే పనులు మొదలైనప్పటికీ పూర్తి స్థాయిలో పనులను చేయాలని సూచించారు. గాంధీ హిల్ వద్ద ఎస్కలేటర్ ద్వారా జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. రైలింగ్స్ పెట్టేటప్పుడు డీసిల్టింగ్ పనులకు ఇబ్బంది లేకుండా వాటికి నాలా మ్యాన్ సరిపోయేంత దూరంలో ఒక గేటును అమర్చాలని తెలిపారు. పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ మాసోత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



సామూహిక కుంకుమ పూజలు



భక్తులకు అన్న ప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. శ్రావణ మాసం ఐదో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై వారాహి దేవి అలంకారంలో ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు ప్రసాద్, విశ్వనాథ్ శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దాతలు, భక్తులచే సామూహిక కుంకుమార్చన, చండీ హోమం, పూర్ణాహుతి చేశారు. అమ్మవారి మూల విరాట్‌కు పంచహారతుల సేవ నిర్వహించగా, నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ళ తిరుమలేష్ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మరుపిళ్ళ తిరుమలేష్‌కు దేవస్థాన కమిటీకి చెందిన గౌరవ అధ్యక్షులు బెవర సూరినారాయణ, కోశాధికారి పిళ్ల శ్రీనివాసరావు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం కల్యాణ మండపంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పూజా కార్యక్రమాల నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను చొక్కర దుర్గారావు, పోతిన ధర్మా, మజ్జి శ్రీనివాస్, ఫణుకు రమా, తమ్మిన సూర్యకుమారి పర్యవేక్షించారు.

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):భగవాన్ వెంకయ్య స్వామి 11వ ఆరాధనోత్సవం (నెల్లూరు జిల్లా గొలగమూడిలో 43వ ఆరాధన) సందర్భంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని వీరాంజనేయ సహిత వెంకయ్య స్వామి మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, 7.30 గంటలకు ధుని పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం 12.15 గంటలకు మహా నివేదన, దశ హారతులు, ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం 6 గంటలకు ఓం నారాయణ ఆది నారాయణ నామ సంకీర్తన చేశారు. రాత్రి 8 గంటలకు వెంకయ్య స్వామికి హారతి ఇచ్చారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం అభిషేకం, అనంతరం అవధూత భగవాన్ వెంకయ్య స్వామి వారి సామూహిక వ్రతం, సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి పల్లకి సేవ కార్యక్రమం జరుగుతాయని భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బోయపాటి శ్రీరాములు, వెంకటరత్నం తెలిపారు. చివరి రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న రుద్ర హోమం కార్యక్రమానికి దుర్గా ప్రసాద్ స్వామీజీ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కాగా తొలి రోజు స్వామివారి అన్నప్రసాదాన్ని విజయవాడకు చెందిన శీలం దివాకరరావు–యశోదరాణి దంపతులు, వారి కుమారుడు అశ్విన్ కుమార్–కృష్ణప్రభ దంపతులు వితరణ చేశారు.

ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో యూరియా, ఇతర ఎరువులు పక్కదారి పట్టకుండా ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేపడతామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఎరువుల సరఫరాపై నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎరువుల సరఫరాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీకి కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. ఎరువులు సమృద్ధిగా ఉన్న నేపథ్యంలో ఎక్కడా పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి, సీఎస్ దిశానిర్దేశం చేశారు. కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకునేలా, నానో యూరియా, ఇతర నానో ఎరువులపైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 4,786 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ కాంప్లెక్స్.. ఇలా మొత్తం 21,374 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎరువులు సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఏసీపీ దుర్గారావు



సదస్సులో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మత్తుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని వెస్ట్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఎస్వీవీఎస్కే దుర్గారావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో ర్యాగింగ్, మత్తు మందుల నివారణ తదితర అంశాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థి జీవితం చాలా విలువైనదన్నారు. జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన జ్ఞానాన్ని అందించే గొప్ప సమయమన్నారు. దీనిని వృథా చేసుకోవద్దని సూచించారు. ఈ సమయంలో ర్యాగింగ్‌కు పాల్పడటం, మత్తు మందులకు అలవాటు పడటం వంటి కారణాలతో ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకున్నారని చెప్పారు. ముఖ్యంగా మత్తు మందులు కలిగి ఉన్నా, సేవించినా, ర్యాగింగ్‌కు పాల్పడిన కఠినంగా శిక్షలు ఉంటాయని తెలిపారు. అటువంటి ఆలోచనల వైపు కాకుండా జీవితాలను సుసంపన్నం చేసుకోవటానికి అవసరమైన లక్ష్యాలను సాధించేదిశగా అడుగులు వేయాలని కోరారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ వంటి అంశాలకు తావు లేదన్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు అవగాహన పరుస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక కొత్తపేట సీఐ కొండలరావు, కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య తదితరులు ప్రసంగించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం...

భవానీపురం(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా జీవితాలు నాశనమవుతాయని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శుక్రవారం గొల్లపూడిలోని శ్రీపోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్కాహాల్, పొగాకు, గంజాయి వంటి వాటి వినియోగంతో శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయని చెప్పారు. యువత వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్నేహితులుగానీ, ఇతర వ్యక్తులుగానీ మాదక ద్రవ్యాల ప్రలోభాలకు గురైతే కచ్చితంగా వద్దని తెగేసి చెప్పాలన్నారు. మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దని కోరారు. ఆరోగ్యం క్షీణించటంతోపాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ బంధాలు దెబ్బతింటాయని చెప్పారు. నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కుంగిపోతారని తెలిపారు. అది నేర ప్రవృత్తి వైపు ప్రేరేపిస్తుందని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతను డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోనేరు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు కె కమలేశ్వర్, జీ లక్ష్మి సరస్వతి, సీహెచ్‌ఓ కె లావణ్య, ఆశా కార్యకర్తలు బీ విజయకుమారి, సీహెచ్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో శ్రావణ శుక్రవారం సందడి



వరలక్ష్మీదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు



పాతశివాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక పూల అలంకరణలో పద్మావతిదేవి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): శ్రావణ శుక్రవారం సందర్భంగా పాతబస్తీలోని ఆలయాలు కిటకిటలాడాయి. శైవాలయాలతో పాటుగా వైష్ణవాలయాలు రద్దీగా దర్శనమిచ్చాయి. అభిషేకాలు, వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలతో కళకళలాడాయి. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో భ్రమరాంబ అమ్మవాకి సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. సుమారు 250 మంది దంపతులు సామూహిక వ్రతాల్లో పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. అమ్మవార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. భ్రమరాంబ అమ్మవారు వరలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అదేవిధంగా అమ్మవారి సన్నిధిలో జరిగిన కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లోని బ్రాహ్మణవీధి వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేకంగా పూలంగిసేవను నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారి మూల విరాట్‌ను అలంకరించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. లక్ష్మీదేవి స్వరూపమైన పద్మావతి అమ్మవారికి శ్రావణమాసంలోని శుక్రవారం కావడంతో సహస్రనామార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. అలాగే పద్మావతి అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని శ్రీవారికి కూడా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

27 నుంచి వినాయక నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వీరాంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలోని వరసిద్ధి వినాయకుడి ఆలయంలో 27వ తేదీ నుంచి నవరాత్రులు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని ఆలయంలో ఏటా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో స్వామి వారికి నిత్య పూజలు, ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఈవో వై. సీతారామయ్య పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):చిట్టినగర్ సెక్షన్ కెఎల్‌రావునగర్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ ఫోర్‌మెన్ బంగ్లా ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు (విజయవాడ టౌన్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు కెఎల్ రావు నగర్ 5వ లైన్, 8వ లైన్, ఫ్రైజర్‌పేట ఏరియా, ఎర్రకట్ట, ఫోర్మెన్ బంగ్లా తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.